"**అమ్మాయి** అదృష్టవంతురాలు" అన్నారు పుట్టింటివారు.

'కోడలి పాదం గొప్పది' అనుకున్నారు అత్తింటి వారు.

పెళ్ళిచూపుల నాటికే శకుంతల భర్త రాజారావు టెలిఫోన్స్ డిపార్టుమెంటులో టెక్నీషియన్‌గా ఉద్యోగం చేస్తూ, డిపార్టుమెంటల్ పరీక్షలు వ్రాసి ఉన్నాడు. పెళ్ళయిన వారం రోజులకు ఫలితాలు తెలిశాయి. రాజారావు టెలిఫోన్స్ ఇన్‌స్పెక్టర్‌గా సెలెక్ట్ అయ్యాడు. అందరూ సంతోషించారు. పై విధంగా శకుంతలను అభినందించారు. కష్టపడి చదివి, పరీక్షలు వ్రాసినది రాజారావే అయినా, సెలెక్షన్‌కు సంబంధించిన క్రెడిట్ అంతా శకుంతలే కొట్టేసింది.

అంతవరకు బాగానే ఉంది కాని, ఇన్‌స్పెక్టర్‌గా సెలెక్టయిన రాజారావు ఎనిమిది నెలలపాటు శిక్షణ పొందవలసి ఉంది.

కొత్త మోజు తీరకుండానే భార్యను వదిలి హైదరాబాద్ వెళ్ళిపోవలసి వచ్చింది రాజారావుకు. భార్యను వెంటబెట్టుకుని పోతే బాగుండునన్న ఆలోచన అతనికి రాకపోలేదు. కాని, అది సాధ్యమయ్యే పని కాదని ఆ ప్రయత్నం విరమించుకున్నాడు. ఆరు నెలలు హైదరాబాద్‌లో థీరీ, తరవాత రెండు నెలలు ప్రాక్టికల్ ట్రెయినింగ్‌కు మరోచోటికి పంపిస్తారు. ఆరు నెలల భాగ్యానికి హైదరాబాద్‌లో సంసారం పెట్టడానికి తను సిద్ధపడినా, అంత త్వరగా ఇల్లు దొరుకుతుందా? ఒకవేళ దొరికినా ట్రెయినింగ్ సెంటర్‌కు అందుబాటులో ఉంటుందా? విధం చెడినా ఫలం దక్కదన్న ఉద్దేశంతో హాస్టల్‌లోనే కాలక్షేపం చెయ్యాలని నిశ్చయించుకున్నాడు. ఈ విరహబాధ తాత్కాలికమైనదీ, తప్పనిసరి అయినదీ కనక అనుభవించి తీరాలి, మరి!

కొందరు ఉద్యోగస్తుల్ని ప్రమోషన్ పేరు చెప్పి దూరతీరాలకు, కనీస సౌకర్యాలుకూడా ఉండని మారుమూల ప్రదేశాలకు బదిలీ చేస్తూంటారు. జీతంలో చెప్పుకోదగ్గ పెరుగుదల ఉండదు. ఇలాంటి ప్రమోషన్ల వల్ల కొత్త ఇబ్బందులు వచ్చి పడతాయి. ఖర్చులు పెరుగుతాయి. అంతకుమించి ఒరిగి చచ్చేదేమీ ఉండదు. కనుక వీటిని ప్రమోషన్లు అనటం కన్న పనిష్‌మెంట్లు అనటం సబబుగా ఉంటుంది.

రాజారావుకు వచ్చిన ప్రమోషన్ ఈ కోవకు చెందినది కాకపోయినా, నూతన దంపతులు విడివిడిగా గడపవలసి వచ్చిందంటే — అంతకుమించిన పనిష్‌మెంటు ఇంకేముంటుంది? ఒకపక్క సంతోషం; మరొక పక్క విచారం. రాజారావుతోపాటు అతని అర్ధాంగిగా శకుంతల కూడా ఆ పనిష్‌మెంటులో అర్ధ భాగం పంచుకోవలసి వచ్చింది.

"అమ్మాయి మా దగ్గరే ఉంటుంది లెండి!" అన్నారు అత్తమామలు. కోడలి పాదం శుభ్రపదమైనదనీ, ఆమె మసలిన చోట మహాలక్ష్మి తాండవిస్తుందనీ వాళ్ళ విశ్వాసం.


"ఎల్లకాలం మీ దగ్గర ఉండవలసిందేగా? ఈ నాలుగు రోజులూ — అల్లుడు ట్రెయినింగ్ పూర్తి చేసుకుని వచ్చేదాకా మా దగ్గరే ఉంచుకుంటాం లెండి" అన్నారు తల్లిదండ్రులు. అల్లుడు లేని సమయంలో అత్త చేతికి కూతుర్ని అప్పగించటానికి కన్నవారి హృదయాలు అంగీకరించలేదు.

లక్ష్మిన భర్జనలు జరిగిన తరవాత — ఇక్కడ కొన్నాళ్ళు, అక్కడ కొన్నాళ్ళు ఉండేటట్లుగా ఉభయ పక్షాల మధ్య ఒప్పందం కుదిరింది.

శకుంతల జీవితంలో కష్టకాలం ప్రారంభమైంది.

పగలు పరధ్యానం — రాత్రులు కలతనిద్ర— కలలు— కలవరింతలు. కలల్లో కూడా పక్షపాతమే. మధురమైన సుఖ స్వప్నాలు మినీ కథల్లా క్షణాల్లో ముగిసిపోతాయి. భారమైన దుస్స్వప్నాలు సీరియల్ నవలల్లా తెల్లవార్లూ సాగుతూ ఉంటాయి.

కాలం స్తంభించిపోయిన అనుభూతి.




క్షణాలు యుగాలుగా మారినట్టు అనుమానం. నవలలు చదవటం, సినిమాలు చూడటం— కాలహరణానికి దివ్యమైన మార్గాలే కాని, పదరు కాలక్షేపాలు శకుంతలను వేగిస్తున్న విరహతాపాన్ని మరింత ప్రకోపింప జేస్తాయే తప్ప శాంతింప జెయ్యలేవు. కనక ఆ రెండూ అభిలషణీయాలు కావు.

ఇంకేం చేస్తుంది శకుంతల?

కథలూ, నవలలూ వ్రాస్తే పేరూ, డబ్బూ— రెండూ దక్కేవే. కాని, ఆ సమయంలో ఆమె కా ఆలోచనే రాలేదు, మరి! ఉత్తరాలు మాత్రం దండిగా వ్రాసింది. ఈమె ధాటికి తట్టుకోలేక మొదట్లో వెంట వెంటనే వ్రాసినా, రాను రాను 'ఇక్కడ ట్రెయినింగ్ చాలా కష్టంగా ఉంటూంది. ఉత్తరాలు వ్రాయటానికికూడా తీరిక చిక్కటం లేదు'అనినేర్పుగారప్పించుకున్నాడు రాజారావు. తరవాత వారానికో, పది రోజులకో ఒక ఉత్తరం వ్రాయసాగాడు. శకుంతల నిరుత్సాహ పడిపోయింది. కనీసం ఉత్తరాలకైనా నోచుకో లేకపోయానే అని కడుంగడు విచారించింది.

ఉత్తరాల వ్యవహారం ఇలా ఉండగా, అత్తగారు మరొక కొత్త సమస్య తెచ్చి పెట్టింది. ప్రతి దినం ఆవిడకు రుక్మిణీ కల్యాణం, గోపికా గీతలా గీత గోవిందం మొదలైన పుస్తకాలు చదివివినిపించాలి. స్వయంగా ఆవిడ చదువుకో గలదు. కాని, కోడలు శ్రావ్యంగా చదివి వినిపిస్తూంటే వినటంలో ఉన్న ఆనందం - స్వయంగా చదువుకోవటంలో ఆవిడకు కనిపించలేదు. ఈ కథలన్నీ భక్తిరస ప్రధానాలంటుంది అత్తగారు. అనటమే కాదు—విని, భక్తి భావంతో పరవశించి పోతూంటుందికూడాను. కోడలికేమో ఇవన్నీ శృంగార కథల్లా అనిపిస్తున్నాయి. ఫలితంగా ఆమె విరహం మరీ విజృంభిస్తూంది.

ఇలా మూడు నెలలు భారంగా గడిచిన తరవాత ఒక అర్ధరాత్రి వేళ వీధి తలుపు చప్పుడైతే బద్ధకంగా లేచి తీసింది శకుంతల.

ఎదురుగా సూట్‌కేసు పట్టుకుని రాజారావు! కలేమో అనుకుంది శకుంతల.

చిలక నవ్వు ఒలికిస్తూ, "నేనే!" అన్నాడు రాజారావు.

నమ్మకం కలగలేదు శకుంతలకు. ఆ రోజే అందిన ఉత్తరంలో—మరో మూడు నెలల వరకు మనం కలిసే అదృష్టం లేదు—అంటూ ఎంతో బాధగా వ్రాశాడు రాజారావు. ఎలా నమ్ముతుంది, మరి!

సూట్‌కేస్ పక్కను పెట్టి, అనుమానంగా తన వంక చూస్తూ నిలుచున్న భార్యను అమాంతం కౌగిలించుకుని, భల్లూకంలా నలిపేశాడు రాజారావు. ఊపిరి సలపక గిజగిజ లాడిపోయింది శకుంతల.

"ఎవరమ్మా వచ్చిందీ?" అంటూ తల్లి లేచి రావడంతో, భార్యను వదిలేసి, "నేనేనమ్మా!" అన్నాడు రాజారావు కంగారుగా. "సూట్‌కేస్ లోపల పెట్టు" అని శకుంతలకు చెప్పాడు.

"వరసనే మూడు రోజులు సెలవు వచ్చింది. నేను మరో నాలుగు రోజులు సెలవు తగిలించి

# శృంగార నాయికలు

## ప్రోషితభర్తృక

– చంద్రం

ఇలా వచ్చేశా. మొత్తం వారం రోజులు!'' లొట్టలు వేస్తూ చెప్పాడు రాజారావు తరవాత, శకుంతలతో.

అనుకోని విధంగా అతను రావటం మొదట ఆశ్చర్యం కలిగించినా, అపరిమితమైన ఆనందం పొందింది తరవాత, శకుంతల.

వారం రోజులంటే ఎంత? మొత్తం ఏడు రోజులేగా? ఏడు క్షణాల్లా గడిచిపోయినాయి.

అంత తొందరగా వారం రోజులూ గడిచిపోయినా యంటే వాళ్ళిద్దరికీ నమ్మకం కలగలేదు. కాని, కాలెండర్లు అబద్ధం చెప్పవు కదా!

ఉసూరుమంటూ సూట్ కేస్ పట్టుకుని బయలుదేరాడు రాజారావు.



దిగాలు పడిపోయింది శకుంతల.

ఈ వారం రోజులూ చవి చూసిన మధుర క్షణాలను నెమరు వేసుకుంటూ మళ్ళీ మూడు నెలలు గడపాలి! మూడు నెలలంటే మాటలా!' మూడు ముప్ఫైలు తొంభై రోజులు

ఈ లోగా ఆషాఢ మాసం వచ్చింది.

పుట్టింటివారు తీసుకు వచ్చారు శకుంతలను.

"ఇంతలా చిక్కిపోయావేమిటమ్మా?" అని ఆశ్చర్యంగా అడిగింది శకుంతల తల్లి, కూతుర్ని చూసి. "మూడు నెలలకే సగమై పోయావు. జీవితాంతం ఎలా నెట్టుకొస్తావే అత్తవారి ఇంట? మీ అత్తగారు సరిగా చూడడం లేదా? వేళకు తిండి పెడుతుందా? ఇంటెడు చాకిరీ నీతోనే చేయిస్తుందా ఏమిటి? ఎలాంటి పిల్లవు ఎలా అయిపోయావు? చెక్కిళ్ళలో నీడ కనిపించేది. గుంట కళ్ళు పడిపోయి, చిక్కి శల్యమై పోయావు! మీ అత్తగారు మంచిది కాదా?" గుచ్చి గుచ్చి అడిగింది ఆవిడ.

కూతురు చిక్కిపోవటానికి కారణమంతా అత్తగారి ఆరళ్ళే నని శకుంతల తల్లి అభిప్రాయం. ఆవిడ అడిగిన ప్రతి ప్రశ్నలోనూ అదే భావం ధ్వనించింది.

తల్లి అమాయకత్వానికి చిన్నగా నవ్వుకుంది శకుంతల. "అలాంటిదేమీ లేదు లేమ్మా! నువ్వు ఊరికే కంగారు పడిపోకు. మా అత్తగారు చాలా మంచివారు. సరా? నువ్వింక నిశ్చింతగా ఉండు" అంది.

"నిశ్చింతగా ఎలా ఉండమంటావే, తల్లీ? నీ వాలకం చూస్తూంటే నెల్లాళ్ళు లంఖణాలు చేసినట్టున్నావు. ఈ వయసు పిల్ల లెలా ఉండాలి? బొత్తిగా నోరు లేదు. మరీ మెతక మనిషివి. ఎలా బ్రతుకుతావో, ఏమో!"

వారం రోజులు బలవంతాన కోడి గుడ్డూ, పాలూ తాగించి, పుష్టికరమైన వంటకాలు చేసి పెట్టింది ఆ తల్లి కూతురికి. అంతా ఆవిడ ఆరాటమే కాని, ఆశించిన ఫలితం కనిపించ లేదు.

చలాకీగా తిరగవలసిన పిల్ల మందకొడిగా ఉండటం, పెట్టింది సరిగా తినక పోవటం, వేళకు నిద్ర పోకపోవటం, పరధ్యానంగా ఉండటం—ఈ లక్షణాలన్నీ చూసిన మీదట ఆవిడ కేదో అనుమానం వచ్చి వెంటనే లేడీ డాక్టర్ దగ్గరికి తీసుకువెళ్ళి చూపించింది కూతుర్ని.

శకుంతలను పరీక్ష చేసిన డాక్టర్-"అమ్మాయి కే జబ్బూ లేదు. బలవర్ధకమైన ఆహారం పెట్టండి. చాలు" అని చిన్న సలహా చెప్పి ఊరుకోవటంతో ఎంతో నిరుత్సాహం కలిగిం దావిడకు. కూతురి లక్షణాలను బట్టి నెల తప్పిందేమోనని ఆశపడిం దావిడ. అది కాకపోవటం మాట అటుంచి ఏ జబ్బూ లేకపోతే మనిషి ఎందుకు చిక్కి పోతుందో, ఆవిడకు అర్థం కాకుండా పోయింది. డాక్టరే ఆ మాట చెబుతూంటే తను కాదనేందు కే ముంటుంది కనక! అయినా, బతిమాలి డాక్టర్ చేత కొన్ని టానిక్కులు వ్రాయించింది బలానికని. ఇంక ఆహారం సంగతి తనే స్వయంగా చూసుకోసాగింది.

ఆషాఢం వెళ్ళిపోయి శ్రావణం వచ్చింది.


ఆచారం ప్రకారం శకుంతల అత్తవారి ఇంటికి వెళ్ళి, ఒక వారం రోజులు ఉండి తిరిగి వచ్చింది.

అల్లుణ్ణికూడా రప్పించే ప్రయత్నం చేశాడు శకుంతల తండ్రి. కాని, ఇప్పట్లో రావడం కుదరదనీ, ప్రాక్టికల్ ట్రెయినింగ్‌కు వెళ్ళే ముందు తప్పకుండా వస్తాననీ, ఆచారాలను వ్యతిరేకించటం తన అభిమతం కాకపోయినా, పరిస్థితులను బట్టి కొన్ని సందర్భాలలో సర్దుకు పోవడం తప్పదనీ చాలా గొప్పగా ఉత్తరం వ్రాశాడు రాజారావు, మామగారికి. అల్లుడి ఉత్తరం చదివి తెగ మురిసిపోయారు మామగారు.

శకుంతలకు చాలా ఆనందంగా ఉంది. 'మరో రెండు నెలలు కళ్ళు మూసుకుంటే మా కష్టాలు గట్టెక్కినట్టే'అని తనకు తానే ధైర్యం చెప్పుకుంది.

రెండు రోజులు ఉండి, మూడవ నాడు ప్రయాణమయ్యాడు రాజారావు. వెళ్ళే ముందు ఒక ( అ ) శుభవార్త చెప్పి మరీ వెళ్ళాడు.

ట్రెయినింగ్‌లో ఉంటూనే తన డిపార్టుమెంటుకు సంబంధించిన జూనియర్ ఇంజనీర్ పరీక్షలు వ్రాశాడు రాజారావు. సెలెక్టయ్యాడు కూడాను. దానికి సంబంధించిన శిక్షణా కాలం ప్రాక్టికల్ ట్రెయినింగ్‌తో కలిపి పధ్నాలుగు నెలలు.




తల్లి ఎంత కృషి చేస్తున్నా, శకుంతల పరిస్థితిలో మార్పు లేకపోయింది. అసలు కారణం ఊహించలేని ఆ కన్నతల్లి హృదయం ఎంతగానో బాధ పడింది. శక్తి వంచన లేకుండా తన ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉంది తల్లి.

తల్లి ప్రవర్తన మరీ చాదస్తంగా కనిపించి చిరాకు కలగసాగింది శకుంతలకు.

తన కే జబ్బూ లేదని చెబుతూంటే వినిపించు కోరేం వీళ్ళు?

భర్త పైన మరులు కొని, ఆ బెంగతోనే ఇలా నీరసించి, కృశించి పోతున్నానని ఏ ఆడపిల్ల మాత్రం తల్లితండ్రులతో చెప్పుకుంటుంది?

ఎంత కష్టమైనా, తమ వియోగానికి అంతం ఉన్నదని తెలుసు కనక, నిబ్బరంగా కాలం గడప సాగింది శకుంతల.

రాజారావుకు హైదరాబాద్‌లో ఆరు నెలల ట్రెయినింగ్ పూర్తి అయిపోయింది. ప్రాక్టికల్ ట్రెయినింగ్ బొబ్బిలిలో వేశారు. మామగారికి ఉత్తరం వ్రాసిన ప్రకారం హైదరాబాద్ నుండి బొబ్బిలి వెళుతూ, దారిలో మామగారి వూరైన గుడివాడలో దిగి, కొత్త బట్టలు పెట్టించుకున్నాడు రాజారావు.

తీరికి సంబంధించిన పది నెలల శిక్షణ బహుశః జబ్బల్ పూర్‌లో ఇవ్వవచ్చు. మిగిలిన నాలుగు నెలలు ఆంధ్రప్రదేశ్‌లోనే ఎక్కడో ఒక చోట ఇస్తారు. బొబ్బిలిలో టెలిఫోన్స్ ఇన్‌స్పెక్టర్‌కు సంబంధించిన రెండు నెలల ప్రాక్టికల్ ట్రెయినింగ్ పూర్తి అయ్యే నాటికి జూనియర్ ఇంజనీర్ ట్రెయినింగ్‌కు ఆర్డర్సు రావచ్చునని అంటున్నారట.

ఇదీ రాజారావు చెప్పిన వార్త.

ఈ వార్త విని ప్రాణ్వడిపోయింది శకుంతల.

★

**(తన ప్రియుడు పరదేశగతుడైనప్పుడు కృశించే నాయిక-ప్రోషిత భర్తృక.)**

**వచ్చే వారం**
**శృంగార నాయిక-**
**అభిసారిక**